మూడురోజుల తరువాత పేరయ్యగారు మోసుకొచ్చిన వార్తకు కాంతమ్మకు మతిపోయింది. కారణాంతరాలవలన ఆ సంబంధం రద్దుచేసుకున్నట్లు కబురు పెట్టారు మగపెళ్ళివాళ్ళు.

"తాంబూలాలు పుచ్చుకున్నాక ఈ సంబంధం ఎందుకు మానుకున్నట్లు వాళ్ళు? రజని అంటే కిట్టనివాళ్ళు ఎవరో దానిమీద ఏమేమి కల్పించి చెప్పారో!..." అంది కాంతమ్మ బాధగా, కోపంగా.

"అమ్మమ్మా!....రజని బంగారంలాంటి పిల్ల....అమ్మాయిమీద వాళ్ళకు ఏ విధమైన అనుమానమూ లేదు" అన్నాడు పేరయ్యగారు నొచ్చుకుంటూ.

కాంతమ్మ ఆశ్చర్యపోయింది.

"మరయితే....!!" అంది అయోమయంగా.

"ఏం లేదమ్మా....లోకం కదూ, ఏదో అర్థంపర్థంలేకుండా వాగుతూ వుంటుంది...." నసిగాడు ఆయన.

"దయచేసి ఏం జరిగిందో దాచకుండా చెప్పండి" కాంతమ్మ కుతూహలం హెచ్చింది_ఆతృత పెరిగింది.

"అదేనమ్మా!....ఇంటిలో అద్దెకుంటూన్న కుర్రాడితో పిల్ల తల్లికి సంబంధమున్నదనీ...."

భూమి గిర్రున తిరిగింది కాంతమ్మకు.

తాను తరచు సుందరమూర్తితో మాట్లాడేందుకు తన గదికి రప్పించుకోవడమూ....తాను అతన్ని బ్రతిమలాడుతూ చేతులు పట్టుకోవడమూ.... అండాళమ్మ రావడమూ....ఆ దృశ్యాలన్నీ ఒక్కొక్కటే కళ్ళముందు తిరిగాయి. అశనిపాతంలాంటి ఆ అపవాదుకు మూలం అండాళమ్మ రూపం....మదిలో తళుక్కుమంది_

కొరివితో తల గోక్కున్నట్లు గ్రహించడంతో — కొయ్యబారిపోయింది కాంతమ్మ.





జొన్నలగడ్డ లలితాదేవి

# అనుకోనిది

ఆ రోజు ఆదివారం. ఇల్లంతా చెత్త ఎక్కువయి, దుమ్ము పేరుకుపోయి నానా ఛండాలంగా వుంది. శుభ్రంగా పెట్టెలు, చెక్కబీరువాలు అన్నీ తీసి దులిపి పనికిరానివన్నీ అవతల పారేసి, అవసరమైనవే అట్టిపెట్టాలనుకుంటూ పెట్టె ముందువేసుకుని కూర్చున్నాడు చంద్రకాంత్.

ఇంట్లో తను, తనతండ్రి తప్ప వేరే ఎవరూ లేరు. అమ్మ పోయాక తండ్రి గదిలోంచి బయటకు రావడం చాలా తక్కువ. ఒకవిధంగా వృద్ధాప్యంలో ఆయనకి భరించరాని దెబ్బకొట్టాడు భగవంతుడనే చెప్పాలి. దాన్ని ఆయన గరళకంఠుడిలా ఆ దుఃఖాన్ని దాచుకోవడానికి చేసే ప్రయత్నమే ఆ గది వదిలి పెద్దగా రాకపోవడం.

వంట అంతా అయ్యాక భోజనానికి రమ్మని పిలిస్తే అప్పుడు లేచి సావకాశంగా స్నానంచేస్తాడు శ్రీనివాసరావు.

తండ్రి రిటైరయిపోవడం- తన తల్లి చనిపోవడం ఒక వారంలో జరగడం ఆయన్ని తీరుబడిగా కూర్చుని విచారిస్తూ వుండు అంటూ భగవంతుడు హేళన చేయడమే ననుకుంటూ వుంటాడు చంద్రకాంత్. పెట్టె తీసి దులపడం ప్రారంభించాడు.

సామాన్యంగా బిల్లులు, పాత ప్రిస్క్రిప్షన్లు, ఎప్పుడో ఎవరో పంపిన పెళ్ళి శుభలేఖలు — ఏవో కరపత్రాలు ఇత్యాదివి ఏదీ పోనీయకుండా ట్రంకు పెట్టెలో దాచడం చంద్రకాంత్

తల్లికి మొదట్నుంచీ అలవాటు. చూస్తూచూస్తూ ఏ పాత కాగితమైనా చింపి పారేయడానికి ఆ చేతులు వచ్చేవికావు. తనతల్లి పేరు అలకసుందరి.

ఆమె ఎంత జాగ్రత్తపరురాలంటే తను చదివిన చిన్నక్లాసుల నోట్సులు కూడా పదిలంగా దాచుకున్నది. "ఎందుకీ చెత్త!" అని ఎవరైనా అంటే "వుండనీయండి ఆ చెత్త ముందువేసుకున్నప్పుడల్లా ఎన్నో మధురాతి మధురమైన అనుభూతులు కలుగుతాయి" అంటూ నవ్వేది.

ఆ నవ్వులో ఏం మహాత్మ్యంవుందో నాన్న మళ్ళీ నోరెత్తేవారు కాదు. ఆవిడ పెంచే చెత్తనంతా ఇల్లు మారినప్పుడు కూడా మహా ఓపిగ్గా బండిలోవేసి తీసుకువచ్చేవాడంటే తన తల్లి అంటే ఆయనకి ఎంత ప్రేమ, ఎంత అనురాగం వుండేవో అర్థం అయ్యేది.

అది తండ్రి హయాం కనుక చెల్లిపోయింది. కాని తనకంత ఓపికలేదు. ఇల్లు మారాలంటే ఆకాశంఅంటే ధరలతో బండి బాడుగలు కూడా పెరిగిపోతుంటే అమ్మదాచిన ఆరు న్నర పెట్టెల చెత్తని మోసుకుపోవడం దుస్సాధ్యమే ననిపించింది. అందుకే ఈ సంస్కరణ తప్పనిసరి అయింది.

ఆ పెట్టెలో కాగితాలన్నీ తీసి ఓమాటు చదివి చింపి అవతల పారేస్తున్నాడు చంద్రకాంత్.

అట్టడుగున ఓ నీలిరంగు పార్సిల్ కనిపించింది. గట్టిదారంతో కట్టబడివుంది. అది తీయాలంటే కత్తెరో, బ్లేడో ఉపయోగించాలి.

చింపడమా మానడమా అని అటూ ఇటూ తిప్పి చూశాడు. చిన్న వైలెట్ రంగు పెన్సిల్‌తో రాసిన అడ్రసు కనిపించింది.

పి. ప్రభాకరరావు,
తేనాంపేట,
మద్రాసు. అన్న అడ్రసు ఇంటి నెంబరుతోసహా కనిపించి ఉలిక్కిపడ్డాడు.

ఆ అడ్రసు తను ఒకసారి ఒకవ్యక్తి నోటివెంట విన్నాడు. ఎక్కడ?

అతను జ్ఞాపకం చేసుకొంటున్నాడు— అతని మనస్సు వెనక్కి వెనక్కి వెళ్ళిపోతోంది. అది తను తిరుమలా ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడనించి బయలుదేరాడు, టెంత్‌క్లాస్ పరీక్ష రిజల్ట్సు రాగానే తిరుమలేశ్వరుని చూద్దామని.

నెల్లూరులో ఒకాయన ఎక్కాడు.

"కాస్త జరుగుబాబు" అన్నాడుఅతను.

అప్పటికింకా తెల్లవారలేదు. తన కళ్ళు నిద్రతో మూసుకుపోతున్నాయి. ఆ నిద్రమత్తులో సరిగా సర్దుకున్నాడో లేదో తనకే గుర్తులేదు.

"ఎక్కడనుంచి వస్తున్నావు బాబూ?" అని అడిగాడతను.

"విజయవాడనుంచి."

"అయితే ఒక్కడివే వస్తున్నావా? నీ కూడా ఎవరూ రాలేదా?" అని అడిగాడు.





"లేదు. మా నాన్నగారికి ఆఫీసువుంది. మా అమ్మగారికి రావడం కుదరలేదు."

అతనిలెదర్ బ్యాగ్‌మీద "పి. ప్రభాకరరావు, తేనాంపేట, మద్రాసు."అనివుంది.

"మా యింటిపేరుకూడా పి.యే. తెలుగులో ఏమిటి" అని అడిగాడు కుతూహలంగా తను.

"ముందు మీ యింటిపేరు చెప్పు" అతను నవ్వుతూ ప్రశ్నించాడు.

'పసుమర్తి'

అతను నవ్వి మా యింటిపేరు 'పుట్టపర్తి' అన్నాడు.

తన తండ్రిపేరు - ముఖ్యంగా తన తల్లిని గురించే ఎక్కువ ప్రశ్నలు వేశాడు. తమని గురించి, చెల్లెళ్ళు తమ్ముళ్ళని గురించి ఎంతో కుతూహలంగా అడిగాడు. తనకి అసలు ఎవరన్నా అదేపనిగా ప్రశ్నలువేస్తుంటే మటుకు ఒళ్ళు మండిపోతూ వుంటుంది. కాని ప్రభాకరరావు ఏ ప్రశ్న అడిగినా విసుక్కోబుద్ధి కావడంలేదు సరిగదా ఎంతో ఓర్పుగా ఎంతో ఉత్సాహంగా జవాబు చెప్పబుద్ధి వేసింది.

అతను ఫ్లాస్కులోంచి వేడివేడి టీ తీసి అందించాడు.

అక్కడ ఎవరో నిద్రలేచి తామిద్దర్నీ చూస్తూ 'మీ అబ్బాయా?' అని అడిగాడు ప్రభాకరరావుని. ఆ వయసులో ప్రభాకరరావు బహుశా చంద్రకాంత్‌లానే వుండేవాడేమో మరి. అతను తొట్రుపడి "మా అబ్బాయికాదు—ఏదో రైల్లో తారసపడిన వ్యక్తి" అంటూ జవాబిచ్చాడు.

తర్వాత తామిద్దరూ తిరుపతి చేరాక పైకివెళ్ళి దర్శనం చేసుకుని తిరిగి క్రిందికి దిగేవరకూ ఇద్దరూ కలిసే తిరిగారు. గోవిందరాజస్వామివారిగుడి - పద్మావతీదేవిగుడి అన్నీ తిరిగి చివరకు తిరుమలా ఎక్స్‌ప్రెస్‌లో తను ఎక్కేవరకూ తన వెంటే వుండి "ఎప్పుడైనా వస్తే మద్రాసు తప్పకుండా మా యింటికి రా!" అని చెప్పి అతను ఆప్యాయంగా భుజంతట్టి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత ఈనాడే ఆ అడ్రసు చూడటం.

ఆ ర్వాత—ఒకసారి ఎప్పుడో తల్లి-తండ్రి దీపావళి పండుగ సందర్భంగా అనుకున్న మాటలు చటుక్కున గుర్తువచ్చాయి.

ఆ పండుగకి, తమ్ముడికి చెల్లెలికి బాగా ఖరీదైన బట్టలు కుట్టించారు నాన్న- తనకి మామూలు బట్టలు కుట్టించి తల్లికి చూపించినప్పుడు—

"అంతేలెండి, కన్నకొడుకుల్ని చూసినట్టు వాడినెందుకు చూస్తారు? వాడెలాగైనా పరాయివాడేగా" తల్లి నిష్ఠూరత విని తను ఉలిక్కిపడ్డాడు.

ఆ మాటకి తండ్రి చాలా బాధపడి "ఇంకొకసారి ఆ మాట నవ్వులాటగా అని నా గుండెలో బాధని - పిల్లల మనసులో కల్మషాన్ని రేకెత్తించకు - మరో

పది రోజుల్లో వాడి పుట్టినరోజు గదా అప్పుడు కుట్టించవచ్చుని ఇప్పుడు సాదావే తెచ్చాను." అన్నారు.

ఆ మాటకి తల్లి తప్పక నోరు మూసింది.

'పరాయివాడు!' అన్నమాట గుండెలో ఎక్కడ నాటాలో అక్కడే నాటినా ఆ తర్వాత తను పట్టించుకోలేదు.

కాలచక్రం గిరగిరా తిరిగిపోతోంది. చిన్నలు పెద్దలయ్యారు. పెద్దలు వృద్ధులయ్యారు. తను డిగ్రీహోల్డరయ్యాడు. గారాబంగా ఒక్క ఆడపిల్ల అనుకుంటూ పెంచిన చెల్లెలు హఠాత్తుగా కన్ను మూసింది. నాన్నగారు తనని తమ్ముడిని దగ్గర కూర్చోపెట్టుకుని ఎలా వెక్కి వెక్కి ఏడ్చారో తనకి బాగా గుర్తు.

ఆ తర్వాత అంతే దుఃఖాన్ని తమ్ముడు మిలటరీలోకి వెళ్ళిపోయినప్పుడు అనుభవించాడాయన. చివరకు అమ్మ పోవడంతో ఆయన జీవితం మరీ అంధకారమయింది.

మెల్లగా ఆ పీలిరంగు ప్యాకెట్ విప్పాడు చంద్రకాంత్.

అందులో ఒక ఫోటో బయటపడింది. అది ప్రభాకరరావుది. ఆ ఫోటో చూస్తుంటే తనే అంటారెవరైనా — తన వయసులో ప్రభాకరరావు ముమ్మూర్తులా తనలానే వున్నాడు. ఆ ఫోటో అట్టమీద "నా ప్రియమైన అలకసుందరికి ప్రేమానురాగాలతో—ప్రభాకర్," అని వుంది.

అది చూడగానే చంద్రకాంత్ కళ్ళు తిరిగాయి. ఎప్పుడువచ్చాడో ఏమో శ్రీనివాసరావు "బాబూ కాంత్! కొన్నిటిని చూడకూడదు అన్న నిబంధంవుంటే దాన్ని చూడకుండా వుండటమే మనసుకు శాంతి. కాదని ఎదురునిలిస్తే అశాంతి అలజడీతప్ప మనకి ఏమీ మిగలదు. ప్రశాంతంగా ప్రవహించే నీటిని ప్రశాంతంగానే ప్రవహించనిస్తే శ్రేయస్కరం. రాళ్ళువేసి కలంకం రేగించేకంటే — ఎవరు ఎన్ని అన్నా మీ అమ్మ అలకసుందరీదేవి ప్రేమమయి - ఆ ప్రేమమూర్తిని ప్రేమమూర్తిగానే ఎప్పటిలానే గుండెలో పదిలపరచుకో. ఆ ఫోటో తగలేయి. అంతటి అనురాగమయి మీ అమ్మే పోయాక ఇంకా ఎందుకురా ఆ ఫోటోలు — గొడవలు!" అంటున్న శ్రీనివాసరావు మాటల్లో ఏదో గొప్ప సత్యం స్ఫురించినట్లయి — అనుకోకుండానే అగ్గిపెట్టె తీసి ఆ ఫోటో అంటించి వేశాడు చంద్రకాంత్.

శ్రీనివాసరావు తృప్తిగా చంద్రకాంత్‌కేసి చూసి స్నానానికి వెళ్ళిపోయాడు.

# కార్తీక దీపాలు

నాకు శీతాకాలం చిరుచలి అంటే బలే ఇష్టం. చలేకాదు ఆ చలిలో చన్నీళ్ల స్నానం చేయటమన్నా, ఆ మంచులో పరుగెత్తి గుళ్ళో పున్నాగచెట్లకింద పువ్వు ఏరటమన్నా, గుడి మంటపంలో కూర్చున్న జంగంతాత శంఖం లాక్కుని బుగ్గలు మంటపుట్టేదాకా వూదటమన్నా, అవార్లుగారికి తెలియకుండా రెండో చేతిలో కూడా దధ్యోజనం పెట్టించుకోవడమన్నా, మా నాయనమ్మచేత తిట్లు తినటమన్నా చిన్నప్పుడు బలే సరదాగే వుండేది. నాయనమ్మంటే అసలు నాయనమ్మ కాదు. మా నాన్నకు దగ్గరి చుట్టరికం. నన్ను నాలుగేళ్ళప్పుడు తీసుకెళ్ళి పదేళ్ళు వచ్చేదాకా పెంచుకుంది. ఆ తర్వాత మా నాన్న స్కూల్లో చేర్పించటానికి నన్ను పట్నం తీసుకొచ్చేశాడు.

నాయనమ్మ మధ్యమధ్య పట్నంవచ్చి నన్ను తెగ వేధించేది, వాళ్ళ వూరు రమ్మని. నాకూ వెళ్ళాలనే ఉండేది, ఎంచేతో వెళ్ళటం మాత్రం పడింది కాదు. అకస్మాత్తుగా మా చెల్లిపెళ్ళికి లగ్నాలు పెట్టుకోవడంతో నాయనమ్మని తీసుకరావటానికి, మళ్ళీ పదేళ్ళ తర్వాత ఆ వూరెళ్ళాను. చిన్నప్పుడు తెగతిరుగుతూ ఆడుకున్న ఊరయినా, ఆ వీధులూ, ఇళ్ళూ కొంచెం కొత్త కొత్తగా ఉన్నాయి. కొన్ని మార్పులు కన్పించినై. గాలిగోపురం, కోటదిబ్బ, ఆ దిబ్బమీద కొమ్మలు కలుపుకుని మెలేసుకున్న రెండు వేపచెట్లు, ఆ చెట్ల పక్కనే సగంకట్టి ఆపేసిన రథశాల. ఏ మార్పులేకుండా అలాగనే వున్నాయి. గాలిగోపురంలో దేవుణ్ణి వూరేగించే చిన్న రథం ఉంది. దాని చుట్టూ బుల్లిబుల్లి చిలకలు చెక్కారు. చిన్నప్పుడు ఆడుకుంటూ కొంటెతనానికి ఆ చిలకముక్కులు రాళ్ళతో విరగొట్టి ఇళ్ళకు తీసుకుపోయేవాళ్ళం. వస్తూ వస్తూ సరదాగా గాలిగోపురంలోకి తొంగిచూశాను. చిలకముక్కు లన్నీ విరగొట్టే ఉన్నాయి. 'ఇప్పుడు పిల్లలకి విరగొట్టడాని కేంలేవే పాపం!' అనిపించింది. 'ఇంకా నయం మేం చిలకముక్కుల్తో పోనిచ్చాం. వీళ్ళు రథాలే విరగ్గొడుతున్నారేమో' అని నవ్వుకుంటూ వచ్చాను.

నాయనమ్మ నన్ను చూసి పొంగిపోయింది. పక్కవీధినుంచి పెరుగు తెప్పించింది. పొద్దుపోయేదాకా ఏవో కబుర్లు చెప్తోంది. ఎక్కువగా నా చిన్న

సత్యం శంకరమంచి